ప్రజాశక్తి
శుక్రవారం 11 అక్టోబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ఇంకానా.. ఉక్కుపై ప్రతిష్టంభన..!

ప్రైవేటీకరణపై కూటమి సర్కారుకు రావాల్సిన స్పష్టత ఏమిటి ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రతిష్టాత్మక విశాఖ ఉక్కుపై నేటికీ ప్రతిష్టంభన కొనసాగుతోంది. వాస్తవానికి విశాఖ ఉక్కులో ప్రైవేటీకరణ ప్రక్రియకు సంబంధించిన పనులను తెర వెనుక కేంద్రం చేసుకుంటూ పోతున్న సంగతి తెలిసిందే. ప్లాంట్ మనుగడకు కీలకమైన ఉత్పత్తిని ఇప్పటికే పూర్తిగా దెబ్బతీసేసింది. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకుగానూ ఒక్కదానిపైనే ప్రస్తుతం ప్లాంట్ నడుస్తోంది. కాంట్రాక్టు కార్మికులు సుమారు 433 మందిని వివిధ విభాగాల నుంచి ఏరివేసింది. మరోవైపు పర్మినెంట్ కార్మికుల మెడపై షిఫ్టింగ్ కత్తి వేలాడిస్తోంది. ప్రైవేటీకరణ చేసి తీరుతామని మూడేళ్ల క్రితం ప్రకటించిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ నోట నుంచి ఉక్కు రక్షణ మాట మాత్రం రావడం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి తిరిగొచ్చినా ప్లాంట్‌పై ఇంకా సమస్యలు ఉన్నాయంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. మొత్తానికి చంద్రబాబు, విశాఖ ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తదితరులు 'ఇంకా చర్చిస్తున్నాం... సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తున్నాం' అన్న మాటలనే విని పిస్తున్నారు.

మోడీ డిసెంబరులో విశాఖకు రాక

విశాఖలో రైల్వే జోన్ కార్యాలయ శంకుస్థాపనకు ప్రధాని మోడీ డిసెంబర్‌లో వస్తారని, అప్పుడు ఉక్కుపై పూర్తిగా స్పష్టత వస్తుందన్న చర్చ కూడా కూటమి పార్టీల్లో నడుస్తోంది. స్టీల్ ప్లాంట్‌లో కూడా ఇదే విషయాన్ని కార్మికులు చర్చించుకుంటున్నారు. అదీగాక ఇంకా త్రీమెన్ కమిటీని కూడా కేంద్రం నియమిస్తుందంట ?. ఇప్పటికే నలుగురు సిఎమ్‌డిలు ప్లాంట్‌కు మారారు. ఒక సిఎమ్‌డి సెలవులో ఉండగా, అతని స్థానంలో వచ్చిన ఇన్‌ఛార్జి సిఎమ్‌డిని కేంద్రం మార్చేసింది. ఇప్పుడు సక్సేనా ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా వ్యవహరిస్తున్నారు. ఫ్యాక్టరీని పూర్తి సామర్థ్యంతో నడిపే చర్యలకూ, మోడీ విశాఖ రాకకు, కమిటీలు వేసి చర్చించేందుకు ఏమైనా సంబంధం ఉందా ? అని కార్మికులు తాజాగా ప్రశ్నిస్తున్నారు. కేంద్రంగానీ, రాష్ట్రంలోని కూటమి సర్కారుగానీ ఫ్యాక్టరీని నడపాలనుకున్నప్పుడు.. ముఖ్యంగా ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని చెబుతున్నప్పుడు మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లను రన్నింగ్‌లోకి వచ్చేలా ఎందుకు ఢిల్లీ పెద్దలను ఒప్పించలేకపోతున్నారు ? అన్నది ఇప్పుడు అందరిలోనూ ఉద్భవిస్తున్న ప్రశ్న.

ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ కేటాయించాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో కర్మాగారాన్ని నడిపించాలని, పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చర్యలను విడనాడాలని అందరూ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు వరకూ బాలారిష్టాలతో ప్లాంట్ నడుస్తుందా ? ఈలోగా ఊపిరి పోసే చర్యల దిశగా కూటమి సర్కారు చర్యలు తీసుకుంటుందా ? అన్నది వారి విధానంపై ఆధారపడి ఉంది.

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్మికులు

ప్యాకేజీలు 'ఉక్కు' సమస్యకు పరిష్కారం కావు

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నేత రామస్వామి

వార్త మెయిన్‌లో..

వంట నూనెల ధరలు తగ్గించి అమ్మాలి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రైతు బజార్లలో వంట నూనెల ధరలు తగ్గించి అమ్మాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ గురువారం ఆదేశించారు. బహిరంగ మార్కెట్‌లో వంట నూనెల ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో వంట నూనెల వ్యాపారులు, హోల్ సేల్ వ్యాపారులతో ఇటీవల సమావేశం నిర్వహించినట్టు ఆయన తెలిపారు. దీనిలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేసిన సూచనలను అనుసరిస్తూ వ్యాపారులు వంట నూనెల ధరలు తగ్గించి అమ్మాలన్నారు. రైతు బజార్లలో అమ్మకాలు చేసే వంట నూనెల ధరల గురించి చెబుతూ.. సన్ ఫ్లవర్ ఆయిల్ గోల్డ్ డ్రాప్ లీటర్‌ను రూ.128కి, క్రిస్టల్‌ను రూ.130కి, ఫ్రీడమ్‌ను రూ.132కి విక్రయించాలని, అలాగే పామ్ ఆయిల్ లీటరును రూ.120కి అమ్మాలని తెలిపారు. నగర పరిధిలోని 13 రైతు బజార్లలో ఈ ధరలను అమలు చేయాలని ఆయన ఆదేశించారు.

మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు

వార్త 7లో..

జివిఎంసి కార్పొరేటర్ల టూర్‌కు సిపిఎం వ్యతిరేకం

వార్త 2లో..

నిత్యావసరాల ధరలు తగ్గించాలని నిరసన

వార్త 8లో..

అతిథులతో వివిధ విభాగాల విజేతలు

ముగిసిన డాక్టర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్, ప్లే ఫిట్ టేబుల్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఎపి డాక్టర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ సీజన్ - 3 పోటీలు ఎంవిపి.కాలనీలోని ఎస్-3 ఇండోర్ స్టేడియంలో ముగిశాయి. విశాఖపట్నం టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పివిఎన్. సూర్యారావు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

విజేతలు వీరే..

మహిళల అండర్ - 35 ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో డాక్టర్ సరాజిత, 36-45 విభాగంలో డాక్టర్ శైలజ, 46 సంవత్సరాల విభాగంలో డాక్టర్ అరుణ, ఉమెన్స్ డబుల్స్ విభాగంలో డాక్టర్ జీబ అర్షియా, డాక్టర్ సహస్ర విజేతలుగా నిలిచారు. పురుషుల అండర్ - 35 సింగిల్స్ విభాగంలో మిగతా 2లో..

ప్రధాన సమస్యలపై నిర్దిష్ట చర్యలు తీసుకోండి

◆ స్టీల్‌ప్లాంట్, ఎస్‌బిసి బ్రిడ్జి, పోర్టు ఆసుపత్రిపై దృష్టి పెట్టండి ◆ ఎంపీ శ్రీభరత్‌కు సిపిఎం బృందం వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : జిల్లాలోని ప్రధాన సమస్యలపై నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్‌ను సిపిఎం బృందం కోరింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు పివిఎస్‌బి.శ్రీనివాసరాజులతో కూడిన బృందం గురువారం ఈ మేరకు ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును పూర్తిగా నిలిపివేయాలని, కాలపరిమితి పూర్తి పేరుతో నిలిపివేసిన వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులు 433 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేవల్ డాక్ యార్డ్ వద్దగల ఎస్‌బిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ 'పేర్లర్ బ్రిడ్జి' పున:నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఎస్‌బిసి బ్రిడ్జి మీదుగా భారీ వాహనాలు మినహా ప్రయాణికుల వాహనాల రాకపోకలు అనుమతించాలని కోరారు. లక్షలాది మంది ఉద్యోగుల, కార్మికుల, ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించే చర్యలు చేపట్టాలన్నారు.

పోర్టు ఆసుపత్రి గురించి ఎంపీకి వివరిస్తూ.. విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రైవేటీకరణను నిలిపివేయాలని, పిపిపి పేరుతో టెండర్లు రద్దు చేయాలని, 40 వేల మంది లబ్ధిదారుల ఆరోగ్యాలకు రక్షణ కల్పించాలని కోరారు. పోర్టు లాభాలతో నడుస్తున్న క్రమంలో పోర్టు నిధులతోనే ప్రస్తుత ఆసుపత్రిని మల్టీసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా నిర్మించే చర్యలు చేపట్టాలన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను సిపిఎం నాయకులు ఎంపీకి వివరించారు. కనీస వేతనాలు, కార్మిక చట్టాలు రైల్వే కాంట్రాక్టు కార్మికులకు అమలు కావడం లేదని, నెలల తరబడి జీతాలు చెల్లించటం లేదని ఫిర్యాదు చేశారు. అక్రమ తొలగింపులకు పూనుకుంటున్నారని, లేబర్ అధికారుల ఆదేశాలను పాటించటం లేదని తెలిపారు. కార్మిక చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. సిపిఎం నేతలు ఇచ్చిన వినతి పత్రాల్లోని అంశాలపై ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు కేంద్రం అంగీకరించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని, కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారని చెప్పారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో లాభాల్లోకి తేవాలన్న పట్టుదలతో చంద్రబాబు ఉన్నారన్నారు. అక్టోబరు నెలాఖరుకు ప్రత్యేక ప్యాకేజీ వస్తుందని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఉండదని, నిలిపివేసిన కాంట్రాక్ట్ కార్మికులను విధులలోకి మిగతా 2లో..

జివిఎంసి కార్పొరేటర్ల టూర్‌కు సిపిఎం వ్యతిరేకం

- ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు
- ప్రజాధనం దుర్వినియోగంలో వైసిపి బాటలోనే టిడిపి
- అధ్యయనం పేర విహార యాత్రలను ప్రజలు హర్షించరు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్
కోయంబత్తూర్, మైసూర్, బెంగళూర్ నగరాలను కార్పొరేటర్లు అధ్యయనం చేసేందుకు ఈ నెల 20 నుంచి 27 వరకు మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) టూర్ ప్రోగ్రాం నిర్ణయించిందని, దీన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. తాను ఈ టూర్‌ను బహిష్కరిస్తున్నట్టు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ అధ్యయన యాత్ర వల్ల విశాఖ ప్రజలకు మేలు జరగకపోగా అనేక భారాలు మోపబడతాయన్నారు. పౌర సౌకర్యాలు ప్రైవేటీకరించబడనున్నాయని తెలిపారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం చేయడం తగదన్నారు. టూర్ల విషయంలో గతంలో వైసిపి అనుసరించిన పద్ధతినే తెలుగుదేశమూ అనుసరించటం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. టూర్‌కు వెళ్లే మూడు నగరాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్, మంచినీరు, మురుగునీరు వ్యవస్థల నిర్వహణ, పన్నుల వసూళ్లు వంటి వాటిని అధ్యయనం చేయాలని టూర్ పత్రంలో సూచించారని తెలిపారు. కానీ 8 రోజుల్లో కనీసం 3 గంటలు కూడా అధ్యయనానికి సమయం కేటాయింపు లేదన్నారు. విహార ప్రదేశాలు చూడటానికే ఈ టూర్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఈ టూర్‌ను అధ్యయన టూర్‌గా కాకుండా.. విహార టూర్‌గా భావిస్తోందని పేర్కొన్నారు. 2022, 2023ల్లో కూడా ఢిల్లీ, సిమ్లా, కులుమనాలి, చండీఘర్, శ్రీనగర్, అమృతసర్, జమ్మూ కాశ్మీర్, ఆగ్రా వంటి నగరాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, మంచినీరు, పారిశుధ్యం, మురుగునీరు వంటి వాటి నిర్వహణ కోసం అధ్యయన యాత్రలు పేరిట టూర్లు నిర్వహించారని, అప్పుడు కూడా సిపిఎం కార్పొరేటర్‌గా వ్యతిరేకించానని గంగారావు గుర్తుచేశారు. గత టూర్లలో కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, ఇప్పటికీ అధ్యయన రిపోర్టులపైగానీ, అధ్యయనం చేసిన అంశాలపైగానీ చర్చ జరగలేదన్నారు. అప్పుడు కూడా అధ్యయనం పేర విహార యాత్రలు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రజల పన్ను ఆదాయాలను బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులు విహార యాత్రలకు ఖర్చు చేయడాన్ని ప్రజలు హర్షించరన్నారు. ఈ యాత్రల వల్ల పన్నులు పెరగడం, పౌర సౌకర్యాలు ప్రైవేటీకరించడం, యూజర్ ఛార్జీలు వడ్డించడం, నీటి మీటర్ల బిగింపు తదితర భారాలు ప్రజలపై మోపబడతాయని తెలిపారు. అందువల్ల ప్రజలకు ఏమాత్రమూ ఉపయోగపడని ఈ టూర్‌ను కౌన్సిల్‌లో ఉన్న అన్ని రాజకీయ పార్టీలూ బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మనసును రంజింపజేసే కార్యక్రమాల్లో పాల్గొనాలి

మానసిక రోగులకు డాక్టర్ ఎన్ఎన్.రాజు హితవు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మానసిక రోగులు మనసును రంజింపజేసే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఉపశమనం పొందవచ్చని రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ఎన్.రాజు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సర నినాదం 'వృత్తి ప్రదేశంలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనిద్దాం' అని తెలిపారు. ప్రపంచ జనాభాలో మూడో వంతు జనాభా చిన్నా చితక మానసిక చికాకులతో గడుపుతున్నవారేనన్నారు. వీరిలో ఒక శాతం తీవ్ర మానసిక వ్యాధిగ్రస్తులని గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. అయితే వివక్ష కారణంగా బయటకు చెప్పుకోలేని అభాగ్యులు ఇంకెందరో ఉంటారన్నది కఠోర సత్యం అన్నారు. ఈ మధ్య కాలంలో మత్తు, మద్య పదార్థాల బానిసలు లెక్కకు మించి ఉన్నారని, ఆత్మహత్యల వార్తలు నిత్యకృత్యమైపోయాయని, ప్రపంచ జనాభాలో ఆత్మహత్యల్లో అగ్రస్థానం మన దేశానిదే అన్నది వాస్తవమని విచారం వ్యక్తం చేశారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఒత్తిడి, విభిన్న వర్గాల్లో

మాట్లాడుతున్న డాక్టర్ ఎన్ఎన్.రాజు

ఘర్షణ, ఆర్థిక, సామాజిక అంతరాలు, క్షీణించిన కుటుంబ వ్యవస్థ, దిగజారుతున్న నైతిక విలువలు ముఖ్యమైన కారణాలని చెప్పారు. వృత్తి ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రజారోగ్య వేదిక కార్యదర్శి కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కౌన్సెల్య కౌన్సిలింగ్ సెంటర్ నిర్దేశకులు డాక్టర్ నిహాల్ వందన సమర్పణ చేశారు.

ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో..

ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ప్రభుత్వ మానసిక ఆసుపత్రి, విశాఖ మానసిక వైద్యుల సంఘం ఆధ్వర్యాన నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ అజిత వేజెండ్ల హాజరయ్యారు. మానసిక రోగుల వైద్యానికి సంబంధించి ఆసుపత్రికి పోలీస్ విభాగం నుండి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని, మానసిక ఆసుపత్రి ప్రాంగణంలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం - 2017 ప్రాముఖ్యతను వివరించారు. అపోలో హాస్పిటల్స్ సీనియర్ మానసిక వైద్యులు సి.రాధాకాంత్, జిల్లా మానసిక ఆరోగ్య సమీక్ష బోర్డ్ ఛైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి బి.రామారావు, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెవి.రామిరెడ్డి పాల్గొన్నారు.

గొలుగొండ : స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, ఎఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్ నాయుడు, హెచ్‌వి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ప్రధాన సమస్యలపై నిర్దిష్ట చర్యలు తీసుకోండి

తీసుకునేలా చేస్తామని తెలిపారు. ఎన్‌బిసి బ్రిడ్జి పై నుంచి రాకపోకలకు సంబంధించి రక్షణ మంత్రిత్వ శాఖతోనూ, రక్షణ రంగం అధికారులతోనూ మాట్లాడుతానని ఎంపీ చెప్పారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణపైన సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులతో మాట్లాడతానన్నారు. రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు చట్టాల అమలు విషయమై రైల్వే డిఆర్ఎంతో మాట్లాడతానని, వీటిపై చర్చించి పరిష్కరించేలా కృషి చేస్తానని సిపిఎం నాయకత్వ బృందానికి ఎంపీ శ్రీభరత్ హామీ ఇచ్చారు.

ముగిసిన డాక్టర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

డాక్టర్ అశోక్ కుమార్, 45 సంవత్సరాల విభాగంలో డాక్టర్ రామానుజం, డబుల్స్ విభాగంలో డాక్టర్ ఎ.సార్వభౌమ, డాక్టర్ ఫణి శేఖర్, మిక్సిడ్ డబుల్స్ విభాగంలో డాక్టర్ ఫణి, డాక్టర్ జిబ అర్షియాలు విజేతలుగా నిలిచారు.

శామ్‌సంగ్ కార్మికుల అరెస్టులు హేయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తమిళనాడులోని శ్రీపెరంబదూర్ శామ్‌సంగ్ యూనిట్‌లో 1470 మంది కార్మికులు చేస్తున్న పోరాటాన్ని ఉక్కుపాదంతో అణచివేయడాన్ని సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. కార్మికుల అక్రమ అరెస్టులు హేయమని పేర్కొన్నారు. నెలరోజులుగా శామ్‌సంగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పోరాడుతున్నారన్నారు. యాజమాన్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై, పోలీసులను పెట్టి అక్రమంగా ఉద్యోగులు, కార్మికుల ఇళ్లకు అర్ధరాత్రి సమయంలో వెళ్లి అరెస్టులు చేయడం, వారు వేసిన టెంట్‌లను తొలగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ చర్యలు తక్షణమే ఆపాలని కోరారు. 1800 మందికిగానూ 1470 మంది కార్మికులు యూనియన్‌ను పెట్టుకుంటే దానిని యాజమాన్యం తిరస్కరించడం తగదన్నారు. యూనియన్ పెట్టుకొనే హక్కు రాజ్యాంగబద్ధమైనదని, కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యానిది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని గుర్తుచేశారు. ఆ పనిచేయకుండా కార్మికులపై ఉక్కుపాదం మోపడం సమంజసం కాదన్నారు. తక్షణమే ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు యూనియన్‌తో చర్చలు జరపాలని కోరారు. లేనిపక్షంలో శామ్‌సంగ్ ఉద్యోగుల పోరాటానికి దేశవ్యాప్తంగా కార్మికులను కూడగట్టి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

తోపుడు బండ్ల కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఆర్‌టిసి సంస్థ గోడ పక్కన 20 సంవత్సరాల నుంచి చిల్లర వ్యాపారాలు చేసుకుంటున్న 32 మంది తోపుడు బండ్ల కార్మికులను అద్దె షాపుల పేరుతో ఆర్‌టిసి యాజమాన్యం తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నం సరికాదని తోపుడు బండ్ల కార్మిక సంఘం మద్దిలపాలెం జోన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకట్రావు అన్నారు. మద్దిలపాలెం హైవే సెంటర్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైవే ఫేసింగ్‌లో అద్దె షాపులు నిర్మించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తాయని, ఇప్పటికే మద్దిలపాలెం హైవేలో ట్రాఫిక్ ఎక్కువగా ఉందని తెలిపారు. నేషనల్ హైవే పక్కన ఇష్టానుసారం షాపులు కట్టకూడదన్న నిబంధన ఏమైందని ప్రశ్నించారు. జివిఎంసి, విఎంఆర్‌డిఎ అనుమతి లేకుండా ఆర్‌టిసి యాజమాన్యం అద్దె షాపులకు వేలం వేసిందని, తక్షణం అధికారులు వీటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై స్పందించే ప్రముఖ లాయర్ పి.వి.గిరిధర్ మద్దిలపాలెం తోపుడుబండ్ల కార్మికుల వద్దకు వచ్చి లీగల్‌గా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. తోపుడుబండ్ల కార్మికులకు వెండింగ్ కార్డులు ఇచ్చారని, వారిని తొలగించడం సరికాదని అన్నారు. ఆర్‌టిసి యాజమాన్యం బడా బాబులకు తక్కువ రేటుకు స్థలాలు కట్టబెట్టి.. చిన్న చిన్న చిల్లర వ్యాపారాలు చేసుకునే తోపుడుబండ్ల కార్మికులను తొలగించడం విడ్డూరంగా ఉందని అన్నారు. విశాఖపట్నం తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంగుడు సింహాచలం మాట్లాడుతూ జివిఎంసి అధికారులు హాకర్ జోన్‌లో కల్పించవలసిన సౌకర్యాలను ఇంతవరకూ కల్పించలేదని, తక్షణం మంచినీరు, కరెంటు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు, కె.కుమారి, మద్దిలపాలెం తోపుడు బండ్ల కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గణేష్, వై.సాయి తదితరులు పాల్గొన్నారు.

బాల్యం కేంద్రాల్లో వినూత్న బోధన చేపట్టాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోగల బాల్యం విద్యా కేంద్రాల్లో విద్యార్థులను ప్రాథమిక విద్యకు సంసిద్ధం చేసేలా వినూత్నమైన పద్ధతిలో సృజనాత్మకంగా అధ్యాపకులు బోధన చేపట్టాలని జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్‌-ఎస్.వర్మ అన్నారు. గురువారం ఆయన రేసపువానిపాలెంలోని జివిఎంసి బాల్యం విద్యా కేంద్రంలో బాల్యం విద్యా బోధన అభ్యాస సామగ్రి తయారీపై తలపెట్టిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను బాల్యం విద్యా కేంద్రాలలో నమోదైన 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు ఆటపాటలతో కూడిన బోధన జరగాలన్నారు. కార్యక్రమంలో జివిఎంసి బాల్యం విద్యా పథకం సహాయకులు ఆవుపాటి మోహన్ కుమార్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కిడ్స్ గార్డెన్‌లో దసరా సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీ, ఉషోదయ జంక్షన్ వద్దగల కిడ్స్ గార్డెన్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు దుర్గాదేవి, సరస్వతి దేవి, కాళికాదేవి వస్త్రాలంకరణలతో సంప్రదాయకంగా విచ్చేసి అలరించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సాయిలక్ష్మి మాట్లాడుతూ ముందు తరాలకు మన సంస్కృతి సంప్రదాయాలను అందించాలని తెలియజేశారు.

గో సంరక్షణ పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తర భారత దేశంలో గో సంరక్షణ పేరుతో మైనారిటీలు, దళితులు, గిరిజనులపై బిజెపి, ఆర్ఎస్ఎస్ శ్రేణులు దాడులతో రోజురోజుకూ పేట్రేగిపోతున్నాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం పార్టీ విశాఖ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు జిఎస్‌జె.అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హర్యానాలో ఇంటర్ పాసైన విద్యార్థిపై పైశాచికంగా దాడి చేసే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కనీసం ఖండించకపోవడం శోచనీయమని అన్నారు. కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం, గుజరాత్‌లో బాలిక హత్య జరిగినా నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. ఒడిశా, మధ్యప్రదేశ్, మణిపూర్ వంటిచోట్ల భయానక పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. దేశంలో షేర్ మార్కెట్‌లో వంద మంది పెట్టుబడులు పెడితే కేవలం ముగ్గురికి మాత్రమే లాభాలు వస్తున్నాయని, ఇదో పెద్ద మోసమని పేర్కొన్నారు. జిఎస్‌టిపై పెద్దవారికి రాయితీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం చిల్లర వ్యాపారస్తులను మాత్రం వేధిస్తోందని తెలిపారు. రైల్వేలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి పన్నాగం పన్నుతున్నారన్నారు. ఇప్పటికే రైల్వేలో క్లీనింగ్, శానిటేషన్ తదితరాలను ప్రైవేటుపరం చేశారన్నారు. రాష్ట్రంలో ఇసుక సమస్య తీవ్రంగా ఉందన్నారు.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-II AT VISAKHAPATNAM
E.A.52/2023 in C.C.280/2019
Between:
Murali Krishna Nammi,
S/o. N. Appa Rao (Inperson)
...Petitioner/Complainant
And
Sahara Credit Cooperative Society Limited & another ...Opposite Parties
NOTICE
To,
OPP. Party No.1:
Sahara Credit Cooperative Society Limited, Rep. by its Branch Manager, its Branch Office situated as Sahara India Branch office at Gopalapatnam, Visakhapatnam-530 027.
OPP. Party No.2:
Sahara Credit Cooperative Society Limited, Rep. by its Managing Director, its Regd. Office Sahara India Bhavan 1, Kapoorthala Complex, Aliganj, Lucknow-226024.
Please take notice that the above named petitioner/complainant has instituted the above E.A.52/2023 in C.C.280/2019 against both of you and the matter stands posted to 30-10-2024 for your appearance before the Hon'ble District Consumer Disputes Redressal Commission-II at VUDA Complex, Siripuram, Visakhapatnam at **10:30 A.M.**, either in person or any person authorized by you, failing which the Hon'ble Commission will proceed with the matter in your absence, as per law.
(As per the Orders of the Hon'ble Commission)
Murali Krishna Nammi, (Inperson) Advocate R/at D.No.12-23-6, Bala Cheruvu Road, Official Colony, New Gajuwaka (Post), Visakhapatnam-530026.(AP)**Cell:9397125999**

IN THE HON'BLE COURT OF THE II ADDL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P. NO. 16/2023
Between
Sri. Menda Raja Nimmakayala Bujji, S/o Venkateswara Rao, Hindu,'aged 36 years, residing at D.No. 33-1-36/1 Near Mahatmagandhi grandhalayam, Ramamurty panthulu peta, Kancharapalem, ward no.56, Visakhapatnam.
...Petitioner
And :
1. Smt Surisetty Kanthamma, W/o Not known
2.Smt. Surisetty Padma, W/o Kumar
3.Smt. K. Kiranmayi, W/o Naidu
4.Smt. L Lakshmi, W/o Rama Krishna
5.Smt. N Naveena, W/o Raju
6.Sri. Sunsetty Baburao, S/o Not known
7.Sri. Duppalapudi Venkata Ramana, S/o Not known
8 Smt. S. Malleswari, W/o Subbarao
9.Smt. Appikonda Praveena, W/o Mahesh
10.Sri P. Srinivasa Reddy, S/o not known
11.Smt. P. Usharani, W/o Srinivasa reddy
12. Smt. S Bhavani, W/o Ramarao
...Respondents
To
8.Smt. S. Malleswari, W/o Subbarao, Hindu, aged 60 years, residing at D.No.44-37-4/3, Srinivasanagar, Vinayaka temple, 80 feet road, Akkayyapalem, ward no. 43, Visakhapatnam
NOTICE
Please take notice that the the above named petitioner instituted the above matter against all of you and the same stands posted on **29-10-2024 at 10.30 a.m.,** for your appearance. On that date all of you appear inperson or through an advocate before the said honourable court at 10.30 a.m., failing which the matter will be heard and determined in your absence as exparte as per law.
D.SANYASI NAIDU, ADVOCATE
VISAKHAPATNAM,
CELL NO: 9948444780

ధరల దరువు..

- దసరా సందడి అంతంత మాత్రమే..
- పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కారణాలు ఏమైనా బియ్యం, ఉప్పు, పప్పు, వంట నూనెల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో ధరల పెరుగుదల దసరా పండగపై ప్రత్యక్షంగా పడనుంది. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉన్నట్లు విదితమౌతోంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యునికి భారంగా మారాయని చెప్పవచ్చు.

పెరిగిన నిత్యావసర ధరలు ఇలా...

కంది పప్పు కిలో వారం రోజుల కిందట రూ.160 నుంచి రూ.165 ఉండగా, ఇప్పుడేమో రూ.170 నుంచి రూ.175కు చేరింది. పెసరపప్పు రూ.100 నుంచి రూ.120, రూ.130కి, మినప పప్పు రూ.125 నుంచి రూ.130, శెనగ పప్పు రూ.100 నుంచి రూ.110, పంచదార రూ.40 నుంచి రూ.42, గోధుమ నూక, గోధుమ పిండి రూ.35 నుంచి రూ.45, బెల్లం రూ.50 నుంచి రూ.55కు చేరాయి.

అర కొరగా కంది పప్పు సరఫరా..

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యాన ఎండియు వాహనాల ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు కిలో కంది పప్పు రూ.67కు పంపిణీ అరకొరగానే అందినట్లు పలువురు కార్డుదారులు అంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కంది పప్పు రూ.170 నుంచి రూ.175కు కొనలేక పోతున్నట్లు తెలిపారు.

అబ్బో బియ్యం ధరలు ...

బియ్యం ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. 25 కిలోల బియ్యం బస్తా రూ.1500 నుంచి రూ.1550కు (బెల్ బ్రాండ్), కోకిల బ్రాండ్ రూ.1300 నుంచి రూ.1360కు, హిమాలయ రూ.1100 నుంచి రూ.1150కు, మైనా రూ.1150 నుంచి రూ.1200కు పెరిగాయి.

వంట నూనెలు సల సల...

పామాయిల్ లీటరు రూ.100 నుంచి రూ.120, రూ.130, రిఫండాయిల్ రూ.100 నుంచి రూ.120 నుంచి రూ.130కు, సన్‌ఫ్లవర్ రూ.110 నుంచి రూ.120, రూ.130కు పెరిగాయి.

ధరల పెరుగుదల ఆందోళనగా ఉంది

నిత్యావసర వస్తువుల ధరలు కొని తినాలంటే మా లాంటి సామాన్యులకు చాలా ఇబ్బందిగా ఉంది. అరకొర ఆదాయాలతో రోజు వారీ జీవనం కష్టంగా ఉంది. పప్పు, ఉప్పు, బెల్లం ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఎస్.రేణుక
తగరపువలస

ధరలు తగ్గించాలి..

అమాంతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఎలా బతికేది. పండగలు ఎలా జరుపుకునేది. ప్రభుత్వం ధరలు తగ్గించాలి.

పి.దేవి
తగరపువలస

నేరాలు ఘోరాలు

ఉల్లిపాయల లారీ బోల్తా

- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని మామిడిలోవ హైవే వద్ద గురువారం ఉదయం ఉల్లిపాయల లారీ బోల్తా పడి డ్రైవర్, క్లీనర్లకు గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి చెన్నై ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న లారీ మామిడిలోవ సమీపం లోకి వచ్చేసరికి బోల్తా పడింది. డ్రైవర్ హదీసల్ హలం షేక్, క్లీనర్ హైదర్ మోమిన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ గంట్యాడ సంతోష్, ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. సిఐ చింత వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమిలిలో కోలాటం ప్రదర్శనలో మహిళా కళాకారులు

ఉత్సాహంగా కోలాటం పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎండిఒ కార్యాలయం ఆవరణలో గురువారం సాయంత్రం నిర్వహించిన మండల స్థాయి కోలాటం పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 18 జట్లు పాల్గొన్నాయి. గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీలు ఆద్యంతం సభికుల్లో ఉత్సాహాన్ని నింపాయి. తొలుత ఈ పోటీలను జెడ్‌పిటిసి సభ్యుడు గాడు వెంకటప్పడు ప్రారంభించారు. జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి, తహశీల్దార్ పి.రామారావు, చిట్టివలస జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీమోహనరావు ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు ఎస్.అప్పారావు, మాజీ ఎంపిపి యరబాల కృష్ణవేణి, టిడిపి మండల అధ్యక్షులు డిఎన్.రాజు, ఐసిడిఎస్ పిఒశ్రీదేవి, ఇన్చార్జి ఎండిఒ కనకల రమేష్‌నాయుడు, వెలుగు సిసి మీసాల అప్పలనారాయణ, ఎండిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గీతంలో ఆస్ట్రేలియన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : చెన్నైలోని ఆస్ట్రేలియన్ కాన్సులేట్ కార్యాలయం అధికారులుతో పాటు రాయల్ ఆస్ట్రేలియన్ నేవీకి చెందిన అధికారుల బృందం గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఆస్ట్రేలియా డిప్యూటీ కాన్సూల్ జనరల్ డేవిడ్ ఎట్లెస్టన్, ఆస్ట్రేలియా నేవీ ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ క్రిస్టోఫర్ స్మిత్లతో కూడిన ప్రతినిధి బృందంతో గీతం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గౌతమరావు మాట్లాడుతూ, గీతం నిర్వహిస్తున్న వివిధ కోర్సులు, పరిశోధన ప్రాజెక్టులు, అంతర్జాతీయ సంబంధాలను వివరించారు. ఆస్ట్రేలియా డిప్యూటీ కాన్సూల్ జనరల్ డేవిడ్ ఎగ్ లెస్టన్ మాట్లాడుతూ, భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయన్నారు. క్లీన్ ఎనర్జీ, ఆగ్రోబిజినెస్లతో పాటు విద్యా, పర్యాటక రంగాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానంలో పరస్పర సహకారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విశాఖ పోర్టుకు దిగుమతి అయ్యే సరుకులో ఆస్ట్రేలియా బొగ్గు కీలకమైనదన్నారు. ఆస్ట్రేలియాలో పెద్ద ఎత్తున భారతీయులు విద్యనభ్యసిస్తున్నారని, వీరి కోసం సెంటర్ ఫర్ ఆస్ట్రేలియా-ఇండియా పనిచేస్తుందని చెప్పారు. సముద్రయాన రంగంలో భద్రత, వాణిజ్య అభివృద్ధి ఇరు దేశాలకు ప్రధాన అంశం అని తెలిపారు.

ఆస్ట్రేలియా నేవీ ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ క్రిస్టోఫర్ స్మిత్ యువతలో నాయకత్వ లక్షణాలు అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. నేటి తరం యువతలో నైపుణ్యాలు, సృజనాత్మక శక్తి అధికంగా ఉంటోందని, వాటిని దేశం కోసం, సంస్థల అభివృద్ధి కోసం ఉపయోగించాలని సూచించారు. యువత తమలోని బలాలతో పాటు బలహీనతలను విశ్లేషించుకుని తమ చుట్టూ ఉండే వారిని ప్రభావితం చేసేలా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జిసిజిసి) అధిపతి కెవి.ఉమాదేవి, విశాఖ జిసిజిసి డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజల, డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బి.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంత తరలింపును విరమించుకోవాలి

జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతన్న నాయుకులు, చిల్లర వర్తకలు

ప్రజాశక్తి -మధురవాడ : గత 40 సంవత్సరాలుగా మధురవాడలో శనివారం వారపు సంత నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న పేదలను తరలించాలనే ప్రయత్నం మానుకోవాలని సిఐటియు, ఐఎఫ్‌టియు, పిఒడబ్ల్యు సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం జివిఎంసి జోనల్- 2 కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ముందుగా ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ, గత రెండు వారాలుగా సంత వర్తకులను వ్యాపారం చేసుకోనివ్వకుండా బెదిరిస్తూ, సామాన్లను తొలగిస్తూ పోలీసులు, జివిఎంసి సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రాలు ఇచ్చినా దాడులు ఆపకపోవడంతో ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. జోనల్ కమిషనర్ సింహాచలానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం జోనల్ కమిషనర్, పిఎం.పాలెం సిఐ జి.బాలకృష్ణ చర్చలు జరిపారు. సంత వర్తకులను వేరే చోటకు తరలించకుండా, ఇదే ప్రాంతంలో ప్రత్యామ్నాయ మార్గాలను యూనియన్ల ప్రతినిధులు ప్రతిపాదించారు. దీనికి స్పందించిన అధికారులు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అప్పుడు చర్చలు జరుపుతామని హామీఇచ్చారు. అంతవరకు సంత నిర్వహణకు ఆటంకం కలిగించబోమని అధికారులు సంత వర్తకులను హామీ ఇచ్చారు. అనంతరం ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, ఐఎఫ్‌టియు నాయకులు గీత, వెంకటలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు టి.అప్పారావు, శంకర్రావు, వి.వెంకటరావు, ఎస్కె.ఫాతిమా, ఎస్కె.మస్తాన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దొరకట్లేదు

మండల సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు

ఇసుకపై నిలదీస్తున్న సభ్యులు

ప్రజాశక్తి -పద్మనాభం : గ్రామాల అభివృద్ధిలో భాగంగా చేపట్టే సిసి రోడ్లు, డ్రెయినేజీలకు ఇసుక దొరకడంలేదని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు మండల సమావేశంలో ఆవేదన వ్యక్తంచేశారు. పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపిపి కె.రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ, సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతి పంచాయతీకి రూ.15 లక్షలు ప్రభుత్వం మంజూరుచేసిందని తెలిపారు. ఎఇ కెఆర్ పట్నాయక్ మాట్లాడుతూ, గ్రామాల్లో పనులు చేయడానికి నిధులు మంజూరయ్యాయని, ఈ నెల 14 నుంచి 21వ తేదీలోగా వారోత్సవాలుగా పనులు ప్రారంభం కావాలని ఆయన చెప్పారు. దీనిపై శేరీకాండం సర్పంచ్ చిన్నారావు లేచి మాట్లాడుతూ, ప్రస్తుతం ఇసుక దొరకట్లేదని, పనులు ఏలా చేయాలని ప్రశ్నించారు. ఇసుక ఫ్రీగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా కాగితాలకే పరిమితమైనట్లు ఆరోపించారు. శేరీకాండం, రెడ్డిపల్లి గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఎఇ మాట్లాడుతూ, తాగునీటి సమస్య నివారణకు 171 పనులు మంజూరయ్యాయని, వాటిలో 69 పనులు జరుగుతున్నాయని తెలిపారు. జడ్‌పి నిధుల నుంచి 15 బోర్లు మంజూరు అయ్యాయని తెలిపారు. వివిధ శాఖలపై సమీక్షలో సభ్యులు అడిగిన ప్రశ్నలకే ఆయా అధికారులు సమాధానం ఇచ్చారు.

పాండ్రంగి సర్పంచ్ ఝాన్సీ మాట్లాడుతూ, గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేక పనులు గుర్తించక ఇబ్బందులు కలుగుతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఎపిఒ మండలంలోని 22 పంచాయతీల్లో నాలుగు చోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు లేరని తెలిపారు. ఈ గ్రామాలను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించడంతో ఎవరిని నియమించం లేదని పేర్కొన్నారు. దీనిపై ఎంపిపి కె.రాంబాబు కల్పించుకొని జనాభా ప్రాతిపదికన ఎంపిక చేయాలని స్పష్టంచేశారు. పిఎంజివై కింద మంజూరైన ఇళ్లను
పూర్తి చేసుకోవాలని, లేకుంటే నిధులు వెనక్కి వెళ్ళిపోతాయని ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ చెప్పారు. తహశీల్దార్ కె.ఆనందరావు మాట్లాడుతూ, భూ సర్వేలో లోపాలుంటే సరిచేసుకునే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గిరిబాబు, వైస్ ఎంపిపి ఈర్ల రాజేశ్వరి, వైసిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం

మండలంలో వివిధ శాఖల్లో పని చేసిన మండల, గ్రామస్థాయి అధికారులను మండల సర్వసభ్య సమావేశం అనంతరం ఎంపిపి రాంబాబు, ఎంపిడిఒ ఎం.విజయ్ కుమార్ అధ్యక్షతన సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలంటూ ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ డిపార్ట్‌మెంట్లలో రెండు నెలలుగా టెండర్లు పిలవకపోవడంతో సుమారు 600 మంది కాంట్రాక్టు కార్మికులు ఉపాధి కోల్పోయేలా చేసిన యాజమాన్యం చర్యలను వ్యతిరేకిస్తూ స్టీల్‌ప్లాంట్ కొవ్వొత్తుల జంక్షన్ దగ్గర అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఏడాదిగా సమయానికి జీతాలు ఇవ్వకపోయినా పనులు చేస్తున్నారని తెలిపారు. టెండర్లు పూర్తయినా కొత్త టెండర్లకు పిలవకపోవడంతో కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమున్న టెక్నికల్ వర్క్ సిఇడి వర్క్ క్వాలిటీ ఇన్‌స్పెక్షన్ లాంటి అనేక పనులకు టెండర్లు పిలవకుండా ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి యాజమాన్యం కుట్ర పన్నుతుందన్నారు.

సిఐటియు నాయకులు కెపి.సుబ్రమణ్యం మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ కోసం సర్వస్వమూ త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి లేకుండా చేయాలనే యాజమాన్యం కుట్ర పన్నుతోందన్నారు. నామినేషన్ బేస్ మీద టెండర్‌కు పిలిచి ఉపాధి కల్పించే అవకాశం ఉన్నా ప్రభుత్వ పెద్దలు దగ్గర మెప్పు కోసం యాజమాన్యం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి పన్నాగాలను విడనాడి తక్షణమే టెండర్లు పిలిచి కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్‌చేశారు. లేకుంటే కాంట్రాక్టు కార్మికులందరితో కలిసి మరో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నమ్మి రమణ, ఆడారి అప్పారావు, వి.వి.రమణ, బండి అప్పలరాజు, రెడ్డి, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నృత్యప్రదర్శనలిచ్చిన చిన్నారులు

అలరించిన సాంస్కృతిక నృత్యాలు

ప్రజాశక్తి -మధురవాడ : దసరా ఉత్సవాల సందర్భంగా శిల్పారామం జాతరలో గురువారం నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ముందుగా కాళీయ మర్దనం, మహాగణపతి, జనార్దన, త్రిపుష్టా ధనాధన్, సంబల్ జారి గేయాలకు చిన్నారులు దీక్షిత, మాన్విధి, మనోజ, తన్మయి, విషిక, శివాని, మౌనశ్రీ, వినీల, జోష్న భాను, బిందు భవ్య, సంస్మిత, రోషిని నృత్యప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిపాలన అధికారి టి.విశ్వనాథ్ పర్యవేక్షించారు.

యువి స్పేస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న నారాయణ్‌సుబ్రమణ్యం

శంకరమఠం రోడ్డులో యువి స్పేస్ స్టేషన్

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ శంకరమఠం రోడ్డులో యువి స్పేస్ స్టేషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించినట్లు అల్ట్రా వయోలెట్ వ్యవస్థాపకుడు నారాయణ్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ సౌకర్యం అల్ట్రా వయోలెట్ విస్తరణ ప్రయాణంలో 6వ ప్రధాన కేంద్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పూణే, అహ్మదాబాద్, కొచ్చి హైదరాబాద్‌లలో ఇటీవల అల్ట్రావయోలెట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. విశాఖపట్నంలోని కొత్త యువి స్పేస్ స్టేషన్ అధిక-పనితీరు గల ఎఫ్ 77 మాక్ 2 ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను పరిచయం చేస్తుందన్నారు. విస్తృత శ్రేణిలో 2300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ సదుపాయం పూర్తి 3ఎస్ కేంద్రంగా పనిచేస్తుందని చెప్పారు. విక్రయాలు, సేవలు విడిభాగాలను ఇది అందించనుందన్నారు.

గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న బెహరా భాస్కరరావు

గుడ్డ సంచుల పంపిణీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం రైతు బజారులో జెడి ఫౌండేషన్ ఆధ్వర్యాన కుమారి క్యాటరింగ్ అధినేత ధవళ గోపాల్ సోదరుల ఆర్థిక సహాయంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏర్పాటుచేసిన గుడ్డ సంచులను వైసిపి మండల అధ్యక్షులు బెహరా భాస్కరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బజారుకు వెళ్లేటప్పుడు వస్త్ర సంచి పట్టుకొని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ అధికారి నారాయణరావు, పిన్నమనేని శ్రీనివాస్, ధవళ మోహన్, గోల్కొండ శ్రీనివాసరావు, బెహరా సత్యనారాయణ, పెద్దమల్ల నవీన్, ముక్క శివాజీ, జెర్రిపోతుల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 8వ వార్డులోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జోన్-2 కమిషనర్ పి.సింహాచలానికి టిడిపి వార్డు అధ్యక్షులు చెట్టిపిల్లి గోపి తదితరులు వినతిపత్రం అందించారు. వార్డులో పలుచోట్ల మంచినీటి కుళాయిలు ఏర్పాటుచేయాలని, వీధి దీపాలు మరమ్మతులు, సిసి రోడ్లు, మురుగు నీటి కాలువలు నిర్మాణం చేపట్టాలని కోరారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

సమావేశంలో మాట్లాడుతున్న నూకరాజు

ప్రజాశక్తి -ములగాడ : సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పెన్షనర్ల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పెన్షనర్ల సంఘం పారిశ్రామిక ప్రాంత ప్రాంతీయ సమావేశం మల్కాపురం సిఐటియు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సిహెచ్.తమ్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కె.నూకరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మారావు మాట్లాడుతూ, సమావేశాలకు తప్పకుండా హాజరుకావాలన్నారు. నూకరాజు మాట్లాడుతూ 8వ తేదీన పిఎఫ్ ఆఫీస్ వద్ద ధర్నాకు హాజరైన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, 8వ తేదీన పిఎఫ్ కమిషనర్‌తో జరిగిన చర్చలు వివరాలను సభ్యులకు వివరించారు. స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లు రూ.600 కోట్లు కట్టినప్పటికీ ఇంతవరకు ఎలాంటి సమాచారం రాలేదన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌ను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి-సీతమ్మధార: సీతమ్మధార రైతు బజార్‌ను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సందర్శించారు. సబ్సిడీపై అందిస్తున్న ఆయిల్, రైస్, కందిపప్పు, టమోటా కౌంటర్లను పరిశీలించారు. రైతుల సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతు బజార్‌కు వచ్చే వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. సబ్సిడీ టమోటాలు ప్రతి ఒక్కరికీ అందాలన్నారు. తూనికలు, కొలతలు సక్రమ పద్ధతిలో ఉండాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ భాస్కరరావు, రాకేష్, ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సతీష్ పాల్గొన్నారు.

రైతుబజార్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించిన కలెక్టర్

భీమిలి మండలం, అన్నవరం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని అన్నవరం గ్రామంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, తహశీల్దార్ పి రామారావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం పర్యటించి ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించారు. అక్కడున్న రైతులతో మాట్లాడారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. రైతుల నుంచి పలు కోణాల్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేయర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో జన సాహితీ జిల్లా అధ్యక్షులు ఐ.శివాజీరావు అధ్యక్షతన 'మేల్కొన్న ఆసియా', 'స్టాలిన్ గ్రాడ్' పుస్తకాల ఆవిష్కరణ సభ గురువారం నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త పి.జయశీలరావు పుస్తకాలను ఆవిష్కరిస్తూ సర్దార్ అలీ జాఫ్రీ, అన్నా భావు సాఠే రచనలను తెలుగులోకి అనువదించి కొత్తపల్లి రవిబాబు మంచి కృషి చేశారన్నారు. జనసాహితీ సభ్యులు ఓ.రామకృష్ణ పుస్తకాలను పరిచయం చేస్తూ 70 యేళ్ల క్రిందట రచనలైనా నేటికీ ప్రాసంగికత ఉందని, పుస్తకాల నేపథ్యాన్ని వివరించారు. పిడిఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి ఎ.సురేష్ ఈ పుస్తకాల సమకాలీనతను తెలియజేస్తూ యువత అభ్యుదయ సాహిత్యాన్ని చదవాలన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ మాటూరి శ్రీనివాస్, కె.గౌరీశంకర్, అడపా రామకృష్ణ, డి.నటరాజ్, ఆడారి అప్పారావు తదితరులు మాట్లాడారు. విద్యార్థులు కవితా పఠనం చేశారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ దృష్టి దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సంయుక్తంగా గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని నిర్వహించాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైస్ ఛైర్మన్ డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల కంటి సంరక్షణకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఐ క్యాంపులు నిర్వహించి కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షిని అభినందించారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి మాట్లాడుతూ అత్యాధునిక పద్ధతుల్లో ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ నవీన్‌కుమార్, నేత్ర వైద్య శాల వైద్యులు, జూనియర్ వైద్యులు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల విచారణ త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులలో విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ పోలీసులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పెండింగు కేసులపై సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులలో బాధితులకు నష్టపరిహారం, పెండింగు బిల్లు చెల్లింపునకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎస్‌పి ఎం.దీపిక మాట్లాడుతూ కమిటీ సభ్యులు తెలియజేసిన విషయాలపై చర్యలు తీసుకుంటామని, పౌర హక్కులు దినోత్సవాలకు కమిటీ సభ్యులకు సమాచారం అందిస్తామని తెలిపారు. ముందుగా జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కె.రాజేశ్వరి జిల్లాలో పెండింగు కేసులు వివరాలను తెలియజేసారు. గత సమావేశంలో చర్చించిన సమస్యలపై తీసుకున్న చర్యలను కేసుల వారీగా తెలియజేసారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి దీపిక, జెసి జాహ్నవి, జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు

విచారణలో 85 కేసులు, పిటి కేసులు 293 పెండింగు ఉన్నట్లు తెలిపారు. బాధితులకు చెల్లించవలసిన పరిహారం 16 మందికి రూ.21 లక్షలు పెండింగులో ఉందన్నారు.

కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ కేసులపై తీసుకున్న చర్యలు రిపోర్టులను కమిటీ సభ్యులకు ముందుగా అందించాలని కోరారు. ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత సెక్షన్లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వసతి గృహాలలో మౌళిక సదుపాయాలు కొరత తీవ్రంగా ఉందన్నారు. సభ్యులు మాట్లాడుతూ అట్రాసిటీ కేసులకు అవసరమైన కులధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, ఆర్‌డిఒలు వివి రమణ, షేక్ ఆయేషా, డిఎస్‌పిలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణమూర్తి, డిపిఆర్‌ఒ కె.ఇంద్రావతి, కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు, కె.అప్పారావు, జి.మరియమ్మ, కె.వెంకటరమణ, బి.అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

చేగువేరాకు నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

చేగువేరాకు ఘన నివాళి

ప్రజాశక్తి-పరవాడ : చేగువేరా 57వ వర్థంతి సందర్భంగా మండల కేంద్రం పరవాడ సిఐటియు కార్యాలయంలో చేగువేరా చిత్ర పటానికి సిఐటియు నాయకులు గురువారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ కమ్యూనిస్టు నేత, దేశాలు విముక్తి చెందాలని పోరాడిన మహోన్నతమైన వ్యక్తి చేగువేరా అని పేర్కొన్నారు. ఆయన్ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపైనా, మతోన్మాదంపైనా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, నాయకులు టి మల్లేశ్వరరావు, దేవకిషోర్, రాంబాబు, నాగరాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాక గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నీలపు శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇచ్చాపురంలో పనిచేసిన ఈయన బదిలీపై మునగపాక వచ్చారు. గతంలో ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన పివిఎల్ఎన్ ఈశ్వరరావు బదిలీపై మాకవరపాలెం వెళ్లారు. తోటి సిబ్బందిని కలుపుకొని గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకుని వెళ్లేందుకు కృషి చేస్తానంటూ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అధికారులకు సూచించారు. విజయవాడలోని ఏపీ యూఎఫ్ఐడిసి కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో కార్పొరేషన్ అడిషనల్ డైరెక్టర్ బియాని నాగేంద్ర కుమార్, సిఎఫ్ఓ హేమలత, చీఫ్ ఇంజనీర్ వెంకటరామయ్యతో వివిధ అంశాలపై ఆయన చర్చించారు. పెండింగ్ ప్రాజెక్టులను త్వరగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇంటింటికి కుళాయి కనెక్షన్లు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

ఊర్లు వెళ్లే వారి సమాచారం తెలియజేయండి

ప్రజాశక్తి-చోడవరం

దసరాకు దూర ప్రాంత ఊర్లు వెళ్లేవారు తమకు సమాచారం తెలియజేయాలని చోడవరం సిఐ పి.అప్పలరాజు కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇండ్లకు తాళాలు వేసి వెళ్లడం వల్ల దొంగతనాలు జరిగే అవకాశం ఉందని, విలువైన వస్తువులు డబ్బు లాకర్లలో భద్రపరచుకుని ప్రయాణాలకు వెళ్లాలని సూచించారు. వెళ్లే ముందు తమకు సమాచారం అందిస్తే ఆయా ప్రాంతాల్లో తమ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచి గస్తీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా చోడవరం పట్టణంలో దూరంగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు పడే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో చోడవరంలో సుమారు 700 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇల్లులు అద్దెకు ఇచ్చేవారు వారి సమాచారాన్ని తెలుసుకోవాలని ఆయన కోరారు.

కెజిబివిలో పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-వడ్డాది, బుచ్చయ్యపేట

బుచ్చెయ్యపేట మండలంలోని టైప్-4 కేజీబీవీ పాఠశాలలో బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓలు బొంజుబాబు, బి.కాశీ విశ్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డాది కేవీడి జడ్పీ హైస్కూల్లో త్వరలో ప్రారంభం కానున్న బాలికల వసతి గృహం టైప్ -4 కేజీబీవీ పాఠశాలలో పనిచేసేందుకు హెడ్ కుక్ -1, అసిస్టెంట్ కుక్-1, చౌకీదారు -1 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈనెల 15లోగా దరఖాస్తులను ఎంఇఒ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

బీమాతో కార్మికుల జీవితాలకు భద్రత

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్మిక శాఖ ఆధ్వర్యంలో బీమా చేసుకున్న కార్మికుల కుటుంబాలకు భద్రత ఏర్పడుతుందని కార్మిక శాఖ ఏఎల్‌వో బాలకృష్ణ పేర్కొన్నారు. అనకాపల్లి పట్టణం బైపాస్ రోడ్డులో సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో ముఠా కార్మికులను కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమలో నమోదు కార్యక్రమం బాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-శ్రమ నందు నమోదైన కార్మికులకు ప్రమాద బీమా రూ.2 లక్షలు, అంగవైకల్యం పొందితే లక్ష రూపాయలు కార్మిక శాఖ ద్వారా అందించడం జరుగుతుందని చెప్పారు. అసంఘటితరంగా కార్మికులతో పాటు బిల్ బిల్డింగ్ వర్కర్లు, చిల్లర వర్తకులు కూడా ఈ పథకంలో చేరవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదుబాబు, సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్, మందా రాము, భవాని, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న ఎఎల్ఓ బాలకృష్ణ

ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా

తాతయ్యబాబు బాధ్యతల స్వీకరణ

తాతయ్యబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-వడ్డాది, బుచ్చయ్యపేట

ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు గురువారం విజయవాడ ఆటోనగర్ దరి హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇందులో పాల్గొన్న టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి, హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్.రాజు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్, యార్లగడ్డ వెంకటరావు, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జి, జనసేన చోడవరం ఇన్చార్జి పివిఎస్ఎన్ రాజు, టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పివిజి కుమార్, పైలా ప్రసాదరావు, బిజెపి నేత ఈర్లె శ్రీరామమూర్తి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గునూరు మల్లునాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు తాతయ్యబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని తాతయ్య బాబుకి మంత్రి పార్థసారథి సూచించారు.

పలువురు శుభాకాంక్షలు

మునగపాక : ఎపి గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబును మునగపాక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పరవాడ : బత్తుల తాతయ్య బాబును టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా విజయవాడ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

దేవరాపల్లి : బత్తుల తాతయ్య బాబుకు టిడిపి దేవరాపల్లి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమరా బాబురావు, వెంకటేష్, రెడ్డి సురేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 10 వేల దోమ తెరలు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో 10వేల దోమ తెరలు ఉచితంగా పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. వాటిని సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టరు కార్యాలయం నుండి దోమతెరల పంపిణీపై ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో గురువారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద వివిధ కంపెనీలు అందజేసిన పదివేల దోమతెరలను పివిటిజి గ్రామాలలో 2390, గిరిజన గ్రామాలలో 4287, ఇతరులకు 1168, వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలకు 1443 చొప్పున పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. వసతి గృహాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి దోమతెరలను వినియోగించుకునేలా వార్డెన్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాలలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నిల్వనీటి కుంటలలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో 30 వేల దోమతెరల పంపిణీకై వివిధ పరిశ్రమల యాజమాన్యాలను కోరడం జరిగిందన్నారు. పారిశ్రామికవేత్తల సహకారంతో త్వరలో మరిన్ని దోమతెరలు పంపిణీ చేయడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగలక్ష్మి, డిపిఆర్ఒ కె.ఇంద్రావతి పాల్గొన్నారు.

వరి పంటకు తెగుళ్లు

- పురుగు మందుల ధరలకు రెక్కలు
- రైతు సేవా కేంద్రాల ద్వారా అందించాలని రైతులు వేడుకోలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రైతులు కష్టపడి నాటిన వరి పొలాలకు తెగుళ్ళు సోకాయి. వర్షాలు ముందు నుండి తేరుకుంటున్న సమయంలో తెల్ల చిత్త, పొడ తెగుళ్లతో వరి పొలాలు ఎర్రబారిపోవడం, నాటిన కుదురులు భూస్థాపితం అయిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లితోంది. మండలంలోని హరిపాలెం, ఎర్రవరం, కొండకర్ల, చీమలాపల్లి, ఉప్పవరం, ఎం జగన్నాధపురం, పెదపాడు, జగ్గన్నపేట, తిమ్మరాజుపేట గ్రామాలలో వరి పంటను సుమారు 1000 ఎకరాలు విస్తీర్ణంలో నాటారు. వరి పంటకు తెగుళ్ళ సోకడంతో కిమిసంహారక మందులకు వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. క్రిమిసంహారిక మందులు ధరలు ఆకాశాన్నంటాయి. ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు రైతులు అంటున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే క్రిమిసంహారక మదులను సబ్సిడీపై రైతులకు నేరుగా సరఫరా చేయాలని రైతు సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు ఫీల్డ్‌లో తిరిగి పంట పొలాలకు తెగుళ్ళ నివారణకు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని రైతు ప్రతినిధులు కోరుతున్నారు.

వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

శంకుస్థాపన చేస్తున్న 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

సిసి డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పరవాడ : జివిఎంసి 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం పరిసర ప్రాంతాల్లో 40 లక్షలు జివిఎంసి నిధులతో సీసీ కాలువల నిర్మాణానికి గురువారం ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధే ధ్యేయంగా అందరి సహాయ సహకారాలతో పనిచేస్తానని తెలిపారు. ఇంకా కోటి రూపాయలు అభివృద్ధి పనులకు, టెండర్లు పిలుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ విద్యాసాగర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, టిడిపి కూటమి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ తర్వాతే పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్‌సి వర్గీకరణ జరిగిన తర్వాతే పోస్టులు భర్తీ చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా మాజీ అధ్యక్షులు గొటివాడ సామ్రాట్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలో గురువారం జరిగిన ఎమ్మార్పిస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిఎస్‌సి ఫలితాల్లో వర్గీకరణ చేయకుండా సుప్రీంకోర్టు తీర్పుకి విరుద్ధంగా నియామకాలు చేస్తున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎమ్మార్పిఎస్ శాంతియుత నిరసన ర్యాలీ చేస్తున్న మంద కృష్ణ మాదిగని అక్రమంగా అరెస్ట్ చేయడం దురదృష్టకరమ్మన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఇండుగుబిల్లి గోపి, బొర్రా జయరాజు, నీటిపల్లి గౌరి, మారేడుబూడి కోటి, దువ్వు దుర్గాలు, జోగ్రెల లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

మంత్రికి సమస్యలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మున్సిపల్ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణను గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ విజయవాడ సచివాలయంలో కలిశారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రామానాయుడుపాలెం బ్రిడ్జి, అమృత పథకం ద్వారా తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, యాదాద్రి కాలువ తదితర ముఖ్య సమస్యలను మంత్రితో చర్చించారు. ఎలమంచిలి అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

రక్తదాన, వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -దేవరాపల్లి : మండలంలోని చిన్న నందిపల్లి గ్రామంలో బెస్ట్ ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం, అవయవదాన కార్యక్రమం నిర్వహించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 55 మంది రక్తదానం చేశారు. 51 మంది అవయవ దానం చేయడానికి అంగీకారం తెలిపారు. మెగా వైద్య శిబిరానికి వచ్చిన 850 మంది రోగులకు వైద్యాధికారి అశోక్ కుమార్, వై.శ్రావణి, ఎస్‌జె సాయి చందు తదితరులకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పిఎస్ బాబు, చైర్మన్ పల్లా సూరిబాబు, సంతోష్ రాజా, కే శివ, పి వెంకటరావు, గ్రామ పెద్దలు పూడి సత్యారావు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కలెక్టర్ విజయ కృష్ణన్

చెత్త ఊడ్చుతున్న కలెక్టర్, జెసి, ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డులో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఇంటిలోని చెత్తను రోడ్డుపై వేయకుండా తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని, లేదంటే మునిసిపాలిటీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లలో వేయాలని సూచించారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డులో వాకింగు ట్రాక్, రెండు ఓపెన్ జిమ్‌లను రూ.15 లక్షలతో ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, ఆర్‌డిఒ షేక్ ఆయిషా, అధికారులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో శుభ్రం చేస్తున్న కార్మికులు, అధికారులు

మునగపాక : చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లో గురువారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికుల ద్వారా, జెసిబిల ద్వారా తొలగించారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, డిఎల్‌డిఓ మంజుల వాణి, ఏవో ప్రసాద్ కుమార్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో గురువారం 'మాస్ క్లీన్లీనెస్ డ్రైవ్' కార్యక్రమం జరిగింది. మైదానంలోని తుప్పలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, వాకర్స్ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు, మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తెలిపారు.

చోడవరం : గ్రామాలను, గ్రామ పంచాయతీ ఆస్తులను పరిశుభ్రంగా ఉంచాలని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. గ్రామపంచాయతీ ఆస్తుల సామూహిక పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా చోడవరం పార్కులు పరిశుభ్రత పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఆస్తులను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ఆక్రమణలను తొలగించే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ఆంజనేయులు, ఈఓపిఆర్డి మహేష్, పంచాయతీ ఈవో నారాయణరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : రోడ్లపై చెత్త వేయకుండా గ్రామపంచాయతీలు ఇచ్చిన తడి పొడి చెత్త ప్లాస్టిక్ డబ్బాల్లో చెత్త వేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి అన్నారు. పల్లెపండుగ - పంచాయతీ వారోత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రం కె.కోటపాడు మెయిన్ రోడ్‌లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్ల పక్కన తినుబండారాలు అమ్ముకునేవారు, కాయగూరల దుకాణాలు, టీ షాపుల్లో వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. కాలువల్లో చెత్త చేసే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారిశుధ్య నిర్వహణపై షాపుల యజమానులకు అధికారులు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, ఈవోపీఆర్డీ జి.రమణి, గ్రామ సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరంలో పారిశుధ్య పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

కశింకోట : కశింకోట మండలం ఉగ్గినిపాలెం గ్రామంలో గురువారం గ్రామస్తులు శ్రమ దానం చేశారు. మన గ్రామం మనమే శుభ్రం చేసుకొవాలి అని వీధిల్లో చెత్త తొలింగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, కూటిమి నాయకులు కలగా సోమేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉగ్గినపాలెంలో పారిశుధ్య పనులు చేస్తున్న సర్పంచ్ తదితరులు

సహకార బ్యాంకులో ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని నర్సింగబిల్లి సహకార బ్యాంకులో సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆ సంఘ కార్యదర్శి నక్క అచ్చయ్య నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సభ్యులు ఆధార్, నామని ఆధార్ కార్డు, భూమి వివరాలు, సెల్ నెంబర్ నమోదు చేసుకొవాలని తెలిపారు ఈ సంఘ పరిధిలో రైతు సభ్యులు అందరు సహకారం అందించాలని కోరారు.

రతన్ టాటాకు ఘన నివాళి

రతన్ టాటా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

టాటా గ్రూప్ అధినేత రతన్ టాటా అకస్మిక మరణం పట్ల ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వేదిక కార్యాలయం వద్ద గురువారం రతన్ టాటా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు బుద్ధ రాజేష్ మాట్లాడుతూ రతన్ టాటా భారతదేశంలో ప్రత్యక్షంగా 8 లక్షల మంది కార్మికులకు, పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధి కల్పించారన్నారు. దేశాభివృద్ధిలో తన పాత్ర ప్రత్యేకంగా చాటుకున్నారన్నారు. అటువంటి మహోన్నతమైన వ్యక్తికి భారతరత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వేదిక నాయకులు లంకెలపల్లి సూర్యనారాయణ, బుద్ధ రాధా, బుద్ధ శ్రీను, ద్రాక్షారపు పరదేశి నాయుడు పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కొణతాల హరినాథ్ బాబు ఆధ్వర్యాన రతన్ టాటా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పారిశ్రామికవేత్త స్వార్థాలను వదిలి రతన్ టాటా అడుగుజాడల్లో నడవాలని, అప్పుడే ఈ దేశానికి నిరుద్యోగ సమస్య తీరుతుందని చెప్పారు.

మునగపాక : పారిశ్రామిక దిగ్గజం, సామాజిక వేత్త రతన్ టాటా మరణం భారతదేశానికి తీరని లోటు అని జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో తన ఆస్తులతో దేశాన్ని కాపాడుతానని ప్రజలకు భరోసా కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఏ సత్యనారాయణ, బేలా లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా చిత్రపటం వద్ద టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభి రామ్ ఘన నివాళ్లర్పించారు. పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టాటాకు నివాళ్లర్పించిన వారిలో టిడిపి జోన్ 1 మీడియా కో-ఆర్డినేటర్ బైరెడ్డి పోతన్న రెడ్డి, నెక్కంటి సత్యనారాయణ, రాజు, నరేంద్ర ఉన్నారు.

ఖైదీల పట్ల కుల వివక్షపై సుప్రీం నిర్ణయం హర్షణీయం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఖైదీల పట్ల కుల వివక్ష ఉండకూడదని సుప్రీంకోర్టు నిర్ణయం పట్ల మాజీ జైల్ హెడ్ వార్డర్, సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశంలో అన్ని జైళ్లలో ఖైదీలకు కులాల ఆధారంగా వారి పనులను నిర్ణయించే పాతకాలపు జైలు మాన్యువల్‌లో గల చట్టాన్ని సవరించి కుల వివక్ష లేని విధంగా ఖైదీలకు పనులు కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించినట్లు చెప్పారు.

పారిశుధ్య కార్మికులకు కొత్త తోపుడు బండ్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

విరిగిపోయిన తోపుడు బండితో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

అనకాపల్లి పట్టణంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు కొత్త తోపుడు పండ్లు ఇవ్వాలని వారు కోరుతున్నారు. తోపుడు బళ్ళు లేక విరిగిపోయిన బళ్ళుతో పని చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిపై అధికారులకు చెప్పినా పట్టించుకోని దుస్థితి ఏర్పడిందని కార్మికులు వాపోతున్నారు. అనకాపల్లి మున్సిపాలిటీ 80, 81 వార్డుల ఇన్‌స్పెక్టర్లకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఉన్నతాధికారులు పట్టించుకోవట్లేదని చెప్పి దాటవేస్తున్నారని వారు వాపోయారు. విరిగిన పనిముట్లు, వాహనాలతో పనిచేయడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి తోపుడుబండ్లతో ఎలా పని చేయాలని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే జీవీఎంసీ అధికారులు స్పందించి ఆయా వార్డుల్లో కొత్త తోపుడు బండ్లు ఇవ్వాలని కోరుతున్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : డ్యూటీకి వెళ్ళిన యువతి అదృశ్యమైనట్టు కంచరపాలెం పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాటిచెట్లపాలెంలో నివాసముంటున్న డి.భాగ్యలక్ష్మి (23) ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో కొంతకాలంగా పనిచేస్తోంది. ఈ నెల 4న ఎప్పటిలాగానే డ్యూటీకని ఇంటి నుంచి వెళ్లిన భాగ్యలక్ష్మి, సాయంత్రం అయినా తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆమె తల్లి ఈశ్వరమ్మ ప్రింటింగ్ ప్రెస్ వద్ద వాకబు చేయగా భాగ్యలక్ష్మి డ్యూటీకి రాలేదని అక్కడి వారు చెప్పారు. దీంతో తల్లి ఈశ్వరమ్మ ఆమె కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ సోనీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

థింసా కళాకారులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఆదివాసీ సాంప్రదాయ థింసా నృత్య కళాకారులకు గుర్తింపు కార్డులు ఇస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ అన్నారు. గురువారం ఏజెన్సీలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతాన్ని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. చాపరాయి నిర్వహణ తీరుపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. చాపరాయిలో పార్కింగ్ వసూళ్లకు ప్రత్యేక వేలంపాట నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కలెక్టర్‌ను అడగగా, ఆయన స్పందిస్తూ, పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తున్నామని, హైవేరోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత పార్కింగ్‌కు వేలంపాట టెండర్లు నిర్వహిస్తామన్నారు. చాపరాయి జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహణ సిబ్బంది చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే థింసా నృత్యాన్ని ప్రదర్శించే కళాకారులకు గుర్తింపుకార్డులు ఇచ్చి ప్రోత్సాహిస్తామన్నారు.

మాతా, శిశు మరణాలపై అప్రమత్తత

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మాతాశిశు మరణాలపై అప్రమత్తంగా డిపిహెచ్ఎన్ఓ భూలోకమ్మ అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మతాశిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణతోపాటు, ఆహార పరిశుభ్రతను పెంపొందించాలన్నారు. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు అందించడంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్య రక్షకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.. వైద్యాధికారిణి డాక్టర్ అంబిక, ఎంపిహెచ్ఐఓ శౌరి, ఎంపిహెచ్ఎస్‌లు, ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!

- రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు
- డబ్బులు లేవని తొలగింపునకు చేతులెత్తేసిన ఆర్అండ్‌బి
- అవస్థలు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని గ్రామ పంచాయతీ, ఇతర అధికారులు

రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు

ప్రజాశక్తి-కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి, ప్రధానంగా ద్విచక్ర వాహనాలపై వచ్చే వారికి తుప్పల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరగడంతో ఇబ్బందులు పడుతున్నారు, ఇటీవల మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో తుప్పలు తొలగించేందుకు ఎటువంటి ఆదేశాలు గానీ, డబ్బులుగానీ లేవని ఆర్అండ్‌బి అధికారులు బాహటంగానే చేతులెత్తేసి, వెల్లడించారు, పంచాయతీ, మండల పరిషత్ అధికారులు ఆ దిశగా ఆలోచన చేపట్టలేదు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, ఎక్కడిక్కడే మలుపులు కారణంగా రాత్రి వేళల్లో వాహనదారులు మరింత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా తుప్పల కారణంగా విషపురుగులు సంచారం పెరిగిందని, సమీప ప్రాంత రైతులు కాలినడకన వెళ్లేందుకు కూడా భయాందోళన చెందుతున్నారు, ప్రధాన రహదారులుతోపాటు గ్రామీణ ప్రాంత రహదారులన్నీ ఇలా పలుచోట్ల తుప్పలతో కమ్మేసి, దర్శనమిస్తున్నాయి. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అధికారులు నాయకులు పట్టించుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు

నర్సీపట్నంలో 21షాపులకు 351 దరఖాస్తులు : నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

సునీల్‌కుమార్, ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నూతన మద్యం షాపులకు దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. నర్సీపట్నం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 21 షాపులకు గానూ గురువారం సాయంత్రానికి 351 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సిఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. ముందుగా ఈనెల 9వ తేదీ వరకు గడువు విధించగా, ప్రభుత్వం మరో రెండు రోజులు దరఖాస్తు గడువును పెంచింది. ఈనెల 11న శుక్రవారంతో గడువు ముగియనుంది.

నర్సీపట్నం మున్సిపాలిటీలో ఏడు షాపులకు 63 దరఖాస్తులు, నర్సీపట్నం రూరల్ మండలంలో మూడు షాపులకు 24 దరఖాస్తులు, రోలుగుంట మండలంలో మూడు షాపులకు 53 దరఖాస్తులు, కోటవురట్ల మండలంలో నాలుగు షాపులకు 52 దరఖాస్తులు, మాకవరపాలెం మండలంలో నాలుగు షాపులకు 52 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో 127 దరఖాస్తులు రాగా, ఆఫ్ లైన్‌లో మరో 224 దరఖాస్తులు వచ్చాయని సిఐ సునీల్‌కుమార్ వెల్లడించారు. దరఖాస్తులతోపాటు. నాన్ రిపెండబుల్ ఫీజు కింద ప్రభుత్వానికి రూ.7.02కోట్ల ాఆదాయం సమకూరింది. 11 తేదీ వరకు గడువు ఉండడంతో మరిన్ని దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ పోలీసుల అంచనా వేస్తున్నారు.

8 మద్యం దుకాణాలకు 196 దరఖాస్తులు

బి.మధుకుమార్

గొలుగొండ : గొలుగొండ, నాతవరం మండలాల్లో ఎనిమిది మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 196 దరఖాస్తులు వచ్చాయని గొలుగొండ ఎక్సైజ్ సీఐ బి.మధుకుమార్ తెలిపారు. గొలుగొండ మండంలోని నాలుగు షాపులకు 120 దరఖాస్తులు వచ్చాయన్నారు. శుక్రవారం సాయంత్రం వరకు మాత్రమే దరఖాస్తు గడువు ఉందన్నారు.

నిరాశ్రయులను ఆదుకోవాలి

నిరాశ్రయుల షెల్టర్లలోని సిబ్బందిని సత్కరిస్తున్న నాగరాజు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: దయనీయ స్థితిలో జీవితాల్ని వెళ్లదీస్తున్న నిరాశ్రయుల్ని మానవత్వంతో ప్రతి ఒక్కరూ అదుకోవాలని 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు కోరారు. గురువారం ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా ఎయుటిడి షెల్టర్లలో పనిచేస్తున్న సిబ్బందిని అల్లిపురం నెరేళ్ల కోనేరు వద్ద గల తన కార్యాలయంలో డాక్టర్ కందుల నాగరాజు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32వ వార్డులోని భీమ్ నగర్, అలాగే టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో రెండు నిరాశ్రయుల షెల్టర్లు ఉన్నాయని, వాటిల్లో ప్రస్తుతం 180 మందికి పైగా నిరాశ్రయులు ఉన్నట్లు తెలిపారు. ఈ షెల్టర్లు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 6,442 మంది అభాగ్యులకు పునరావాసం కల్పించామన్నారు. పోలీసులు కూడా రైల్వే స్టేషన్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి నిరాశ్రయులను తీసుకొచ్చి ఈ షెల్టర్లలో చేర్పిస్తున్నారని, పారదర్శకంగా పనిచేయడం వలన చాలామందికి ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఎయుటిడి సంస్థ ఢిల్లీలో నడుపుతున్న ఈ షెల్టర్లను చూసి రాష్ట్రంలో మొట్టమొదటగా 2012 డిసెంబర్‌లో జివిఎంసి సహకారంతో విశాఖలో ఈ షెల్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జివిఎంసిలో నడుస్తున్న షెల్టర్లను చూసి తర్వాత గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పుడు సిఎంగా ఉన్న చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రం అంతటా నిరాశ్రయుల షెల్టర్లు ప్రారంభమయ్యాయన్నారు. ఈ షెల్టర్లలో పని చేస్తున్న సిబ్బంది సేవలను గుర్తించి వారిని సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు, ఆర్‌పిపివి.కీర్తి రెడ్డి, ఆర్‌పిపిపి. లావణ్య, శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు హరీష్, గౌతమ్,మేనేజర్ జ్యోతిర్మయి,మేనేజర్ భాస్కర రావు,ధనలక్ష్మి, శ్రీనివాసరావు,ప్రశాంత్ ఆచారి, జివిఆర్ మూర్తి పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ అమలుపై స్పష్టతనివ్వండి

ప్రజాశక్తి - చింతపల్లి :లబ్ధిదారులకు ఏటా మూడు వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ అమలులో ఉన్న సందేహలను నివృత్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. గురువారం స్థానిక గిరిజన సహకార సంస్థ కార్యాలయం వద్ద ఇకెవైసి నమోదుకు వేచి ఉన్న లబ్ధిదారులతో మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో గ్యాస్ వినియోగదారులకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని కూటమి నేతలు వాగ్దానం చేశారన్నారు. ఉజ్వల, దీపం పథకం గ్యాస్ వినియోగదారులకు మాత్రమే ఈ పథకం వరిస్తుందని ప్రస్తుతం సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్న నేపథ్యంలో అయోమయంలో పడ్డ వినియోగదారుల అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలన్నారు. కొందరికి కాకుండా అందరికీ ఉచిత వంటగ్యాస్ సిలెండర్లు ఇవ్వాలన్నారు.

దుర్గమ్మ సారె ఊరేగింపు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని సిహెచ్.నాగాపురం గ్రామంలో శ్రీదేవి శరన్నవరాత్రులను సందర్భంగా గురువారం దుర్గమ్మ సారె ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు శిరస్సున సారెను పెట్టుకొని గ్రామ పురవీధుల్లో డప్పువాయిద్యాలు, బాణసంచా నడుమ ఊరేగించారు. అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పుణ్యకోటి వాహనంపై శ్రీనివాసుడు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను పుణ్యకోటి వాహనంలో అధిష్టింపజేసి గ్రామ తిరుసేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రమదానంతో పరిశుభ్రతా పనులు

నక్కపల్లిలో చెత్తను తొలగిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి -నక్కపల్లి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నక్కపల్లిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రమదానంతో పారిశుధ్య పనులు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం, ఆసుపత్రి, జాతీయ రహదారి పక్కన పరిసర ప్రాంతాలు, హోటల్స్, కిరాణా షాపులు, మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించారు. హోటల్స్, కిరాణా షాపు యాజమాన్యాలతో మాట్లాడి డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయరాదని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయ రత్నకుమారి, మండల ప్రత్యేక అధికారి జి ప్రభాకరరావు, ఎంపిడిఓ సీతారామరాజు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పంచాయతీ ఉపసర్పంచ్ వీసం రాజు, ఇఓపిఆర్‌డి సత్యనారాయణ, ఎపిఓ భాగ్యలత, వెలుగు ఎపిఎం, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోటవురట్ల : గ్రామీణ ప్రాంత ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ అన్నారు, గురువారం మండలంలో పలు గ్రామాలలో సందర్శించి స్వచ్ఛంద పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సేవలను సద్వినియోగించు కోవాలన్నారు, అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఓ కాశీ విశ్వనాథరావు, ఎఓ చంద్రశేఖర్, పలువురు కార్యదర్శులు సిబ్బందితో కలిపి తుప్పలను తొలగించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

గొలుగొండ : గొలుగొండ పంచాయతీలో గురువారం ఇన్‌చార్జ్ ఎంపిడిఓ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు.కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఇఓపిఆర్‌డి అప్పారావు, వెలుగు ఎపిఎం కరుణానిధి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్లలో ప్రత్యేకాధికారి ఉదయశ్రీ ఆధ్వర్యంలో శుభ్రతా పనులు

పూర్వ విద్యార్థుల ఔదార్యం

గాయపడ్డ స్నేహితురాలికి ఆర్థిక సాయం

భార్గవికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఉపమాక గ్రామానికి చెందిన తమ స్నేహితురాలు భార్గవి మూడు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై తీవ్రంగా గాయపడింది. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొంది, స్వగ్రామం చేరుకుంది.

విషయం తెలుసుకున్న పూర్వమిత్రులు గురువారం భార్గవిని పరామర్శించారు. ఆమె ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు,పూర్వ విద్యార్థులు సందీప్, కిరణ్,శివ, పిక్కి కోదండరావు, గోవింద్, పైడియ్య, చంద్రరావు, ఇంద్ర, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి ఆర్మీ వింగ్ లెఫ్టినెంట్‌గా హరికిరణ్

డాక్టర్ హరికిరణ్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పట్టణానికి చెందిన వి హరికిరణ్ కు అరుదైన గౌరవం లభించింది. మాకవరపాలెం అవంతి కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, ఎన్‌సిసి కేరటేకర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ వి హరికిరణ్‌కు ఎన్‌సిసి ఆర్మీ వింగ్ నుండి లెఫ్టినెంట్‌గా ఎన్‌సిసి మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ప్రమోషన్ కల్పించింది. నాగపూర్‌లోని మహారాష్ట్ర ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ప్రి కమిషన్ 75 రోజుల మిలటరీ ట్రైనింగ్ కోర్సులో ఉత్తీర్ణత అనంతరం లెఫ్టినెంట్‌గా ర్యాంక్ లభించిందని హరికిరణ్ తెలిపారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన హరికిరణ్ అంచెలంచెలుగా ఎదుగుతూ ఎన్‌సిసి ఆర్మీ వింగ్ లెఫ్టినెంట్ స్థాయికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, పలువురు అభినందనలు తెలిపారు.

వరి సస్యరక్షణపై అవగాహన

సూచనలు చేస్తున్న ఎఒ సంధ్యారాణి

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాతమల్లంపేట గ్రామంలో గురువారం వ్యవసాయాధికారి సుధారాణి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరి పంటలను పరిశీలించారు. వరి పంటకు తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గెడ్డం నానాజీ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పెరుగుతున్న నిత్యవసర వస్తు ధరలు తగ్గించాలని స్థానిక రామారావు పేట సిపిఎం కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు గురువారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా . సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్న నిత్యవసర సరుకులు, కూరగాయల ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవనం దుర్భరమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. టమోటా, ఉల్లిపాయలు, పప్పులు, నూనెలు ఇతరత్రా దాదాపు అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే డీజిల్, పెట్రోల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పి కన్నా అధిక ధరలకు వస్తువులను అమ్ముతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పెరుగుతున్న నిత్యవసరాల ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న , సిపిఎం, ప్రజాసంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం ప్రజాసంఘాల నేతలు

ఎల్‌ఐసి ఏజెంట్ల ఆందోళన

వినతిపత్రం ఇస్తున్న ఎల్‌ఐసి ఏజెంట్లు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎల్‌ఐసి ఏజెంట్లు నర్సీపట్నంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఎల్‌ఐసి బ్రాంచ్ మేనేజర్, అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈంసదర్భంగా ఎల్‌ఐసి నర్సీపట్నం శాఖ యూనియన్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ నెల ఒకటవ తేదీ నుంచి యాజమాన్యం తీసుకువచ్చిన నూతన పాలసీ అటు పాలసీదారులకు, ఇటు ఏజెంట్లకు విఘాతం కలిగించే విధంగా ఉందన్నారు. దీని వల్ల ఒక్క నర్సీపట్నం బ్రాంచ్‌లోనే సుమారు 2 వేల మంది ఏజెంట్లు, దేశవ్యాప్తంగా 15 లక్షల మంది ఏజెంట్లు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పునరాలోచన చేసి పాత విధానంలోనే ఏజెంట్లకు వచ్చే కమీషన్లను అమలు చేయాలని తెలిపారు.

అలాగే పాలసీ పొందిన లబ్ధిదారుడు సరెండర్‌కు వెళ్లిన సమయంలో ఆ పాలసీ కమిషన్ పొందిన ఏజెంట్ నుంచి నష్టాన్ని రికవరీ చేయాలన్న నిబంధనను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. కొత్త విధానంలో ఎష్యూర్డ్ విలువను రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలకు పెంచారని, దీంతో సామాన్య ప్రజలు బీమా చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఫలితంగా ఎల్‌ఐసి లక్ష్యం నెరవేరదన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చకుంటే సమ్మె బాట పడతామని, పరిష్కారం అయ్యేవరకు నూతన వ్యాపారాన్ని చేయబోమని హెచ్చరించారు.

జిందాల్ పవర్ ప్లాంట్‌కు చెత్త తరలింపు

చెత్త తరలింపును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను అత్యవసరంగా విశాఖపట్నం కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ జె. సురేంద్ర తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో సేకరించిన చెత్తంతా డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిందన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు మేరకు ఈ చెత్తను జిందాల్ పవర్ ప్లాంట్ కు తరలిస్తున్నామని సురేంద్ర తెలిపారు.

స్పీకర్ అయ్యన్న ఆదేశాలతో 35 టిప్పర్ల ద్వారా చెత్తను తరలిస్తున్నామన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద టిప్పర్ల ద్వారా చెత్త తరలింపును ఎఇ రవి, వార్డ్ కౌన్సిలర్ రామరాజు, ధనమిరెడ్డి మధు, పైలా గోవింద్, శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

అసంపూర్తి రోడ్డుతో అనునిత్యం అవస్థలు!

- నిధులు మంజూరైనా పూర్తికాని నిర్మాణాలు
- అర్థాంతంగా పనులను ఆపేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల : అసంపూర్తి రోడ్డు, కల్వర్టుల నిర్మాణాలతో మండలంలో రామచంద్రపురం శివారు అల్లుముయ్యపాలెం, పరిసర గ్రామాల గిరిజనులు అవస్థలు పడుతున్నారు. నిధులు మంజూరైనా నిర్మాణ పనుల్లో అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా గిరిజనులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. దీనిపై సంబంధిత అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

పోలవరం రోడ్డు నుంచి అల్లుమయ్యపాలెం గ్రామానికి రోడ్డు, మధ్యలో కల్వర్టులు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 3.30 కోట్లను మంజూరు చేసింది, అయితే గ్రామం వరకు 1.40 కోట్లతో రోడ్డు మాత్రమే నిర్మించి, దాన్ని కూడా అసంపూర్తిగా వదిలేయడంతో గిరిజనులు పడుతున్నారు. అల్లుమయ్యపాలెం వద్ద వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అదేవిధంగా ఈ మార్గంలో కొన్ని కల్వర్టులు, వంతెన అవతల గ్రామానికి రోడ్డు నిర్మాణం వంటి పనులను సంబంధిత కాంట్రాక్టర్ చేపట్టాల్సి ఉంది. సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో, అరకొరగా చేపట్టిన రోడ్డు నిర్మాణంతో గిరిజన ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గెడ్డపై ఉన్న కల్వర్టు వర్షఉధృతి కొట్టుకుపోవడంతో, ఇపుడు వర్షాకాలం కావడంతో గెడ్డను దాటి వెళ్లేందుకు విద్యార్థులు, ప్రజలు, రైతులు మహిళలు పడుతున్న ఇబ్బందులు చెప్పనలవికాదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రాణ సాహసం చేసి గెడ్డనీటిలో దిగి దాటి వెళుతున్నామని వారంతా వాపోతున్నారు.

అసంపూర్తిగా ఆగిపోయిన అల్లుమయ్యపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు ఇదే

నీటి ఉధృతికి కొట్టుకుపోయిన కల్వర్టు

అయితే ప్రస్తుతం రోడ్డు నిర్మాణం చేపట్టినంతవరకూ ఉన్న భూములన్నీ బడాబాబులవి కావడంతో అక్కడి వరకే రోడ్డు నిర్మించి వదిలేసారని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. గిరిజనుల కష్టాలను పట్టించుకునే దిక్కులేదని వాపోతున్నారు. గత ప్రభుత్వం హయాంలో అనేక పనులు అర్థాంతరం ఆ గిపోవడానికి బిల్లులు చెల్లింపు సమస్య ప్రధానంగా ఉండగా, అల్లుమయ్యపాలెం రోడ్డు నిర్మాణం సగంలోనే ఆగిపోవడానికి కారణా లేమిటో తెలియడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరిస్తుందని, అసంపూర్తి రోడ్డు, కల్వర్టుల నిర్మాణాలను పూర్తిచేస్తుందని వీరంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.